తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పరిగి, జూలై 11: తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసమైన చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. గురువారం 14వ వార్డులో బోరు మోటారును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్య తీవ్రంగా ఉన్న కాలనీల్లో కొత్తగా బోర్లు, పైప్‌లైన్లు వేస్తామని తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, మీర్ తాహెర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో భారీ వర్షం

▸ రైతులకు ఊరట

ఘట్‌కేసర్, జూలై 11 : ఘట్‌కేసర్‌లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న జనానికి ఉపశమనం లభించింది. ప్రధానంగా రైతులు వరి నాట్లు, ఇతర పంటలు వేసేందుకు, వేసిన మెట్టపంటలకు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నిత్యం మబ్బులు కమ్ముకోవడం, కురవకుండానే మాయమడంతో రైతులు నిరాశలో ఉన్నారు. అంతా వానల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో గురువారం సాయంత్రం 6:30గంటల నుంచి 7:30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం రైతులకు కొంత ఊరట కల్గించింది. వాతావరణం చల్లబడటంతో జనం వేడి నుంచి ఉపశమనం పొందారు.



వార్షిక ప్రణాళిక బుక్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

7,528.45కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక

▸ విడుదల చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 11 : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 7,528.45 కోట్లుగా నిర్దేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకర్లతో 'రుణాలు-లక్ష్య సాధన'పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి 7,528.45కోట్ల వార్షిక రుణ ప్రణాళిను పూర్తి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. వీటిలో పంట రుణాలు 3,434.23కోట్లు, ఇతర వ్యవసాయ రుణాలు 725.51కోట్లు, వ్యవసాయ అనుబంధ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 565.05కోట్లు, విద్య గృహ నిర్మాణం, ఇతర రంగాలకు 2,803.66 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వరి పంట సాగు రుణ పరిమితి ఎకరానికి రూ.45వేలు, పత్తి పంటకు రూ.46వేలు, కందులు రూ.24వేలుగా నిర్దేశించామన్నారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళిక బుక్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నాబార్డు డీడీఎం అఖిల్, ఆర్‌బీఐ డీవో గోమతి పాల్గొన్నారు.



ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ బడుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సారి సగం మందే సర్కారు బడుల్లో చేరారు. వారిలోనూ ఎక్కువ సంఖ్యలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చిన ఒకటో తరగతి విద్యార్థులే ఉన్నారు. ఇప్పటి వరకు కొత్తగా 8,587 మంది విద్యార్థులు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అయితే సర్కారు బడుల్లో హైస్కూలు తరగతుల్లో చేరికలు నామమాత్రంగా ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు తెరిచే సమయంలోనే ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టింది. దీంతో టీచర్లు బడి బయటి, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులను చేర్చుకోవడంపై దృష్టిపెట్టక చేరికలు తగ్గాయని అంటున్నారు. ఇదిలా ఉంటే మరిన్ని రోజులు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

▸ గతేడాదితో పోలిస్తే ఇప్పటి వరకు చేరికలు సగమే!
▸ నామమాత్రంగా కొత్త అడ్మిషన్లు
▸ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో పిల్లల చేరికలపై ప్రభావం
▸ మరికొన్ని రోజుల వరకు సర్కారు పాఠశాలలకు కొత్త విద్యార్థులు


చేరికలు అంతంతే!

ఈసారి ప్రభుత్వ బడుల్లో తగ్గిన అడ్మిషన్లు

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన పిల్లలు	ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరికలు	సర్కారు పాఠశాలల్లో చేరిన బడి బయటి పిల్లలు
5,492	2,793	302

ఇప్పటి వరకు కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు: 8,587

వికారాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గత ఏడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. జూన్ మొదటి వారంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను ప్రారంభించగా జూలై మొదటి వారం వరకు జిల్లాలో 8,587 మంది విద్యార్థులు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 2023 జూన్ చివరి నాటి వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 17,394 మంది విద్యార్థులు చేరగా, ఈ సంవత్సరంలో జూలై 10 వరకు 8,587 మంది విద్యార్థులే కొత్తగా అడ్మిషన్ తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియం బోధన ప్రారంభించిన నేపథ్యంలో సర్కారు పాఠశాల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తుండగా, ఈ సారి మాత్రం పెద్దగా విద్యార్థులు చేరలేదు. విద్యార్థుల సంఖ్య గతంలో కంటే పెరిగింది. గత విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన ప్రారంభించడంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలు పెరిగాయి. ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. చదువుకు దూరంగా ఉన్న బడీడు పిల్లలు, పనుల్లో ఉన్న బాలలను గుర్తించి వారినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థుల చేరికలు లేకపోవడం గమనార్హం. దీన్ని బట్టి నాణ్యమైన విద్య విషయంలో తల్లిదండ్రులు ఇంకా ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ స్కూళ్లనే ఎక్కువ నమ్ముతున్నారని అర్థమవుతోంది.



అడ్మిషన్లపై బదిలీలు, పదోన్నతుల ప్రభావం?

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడంతో ఆ ప్రభావం కొత్త విద్యార్థుల చేరికపై పడింది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలోనే ఉపాధ్యాయులు లీనం కావడంతో అడ్మిషన్లపై ఆశించిన స్థాయిలో దృష్టి కేంద్రీకరించలేదు. ఎక్కడ నలుగురు ఉపాధ్యాయులు కలిసినా బదిలీలు, పదోన్నతులపైనే చర్చించుకున్నారే తప్ప విద్యార్థుల చేరికలపై ఆశించిన శ్రద్ధ తీసుకోలేదనేది అందరికీ తెలిసిన విషయమే! కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం వివిధ పనులు చేపట్టింది. కొన్ని పాఠశాలల్లో ఆ పనులు ముగియగా, అక్కడక్కడ కొన్ని తుది దశలో కొనసాగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగవడంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల చేరికలు ఉంటాయని విద్యా శాఖ అంచనా వేసింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు మే నెలలో పూర్తి చేసి ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరిగేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థులు పాఠశాలల్లో చేరే నెలలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో ఆ ప్రభావం విద్యార్థుల చేరికలపై పడిందని అంటున్నారు. ఇప్పటి వరకూ ఏ పాఠశాలల్లో చేరని బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహిస్తే విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

అంగన్‌వాడీ కేంద్రాల నుంచే అత్యధికంగా చేరికలు..

ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలో 8,587 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. వీరిలో అగ్రభాగం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చేరిన వారే ఉన్నారు. 5,492 మంది చిన్నారులు సర్కారు బడుల్లో చేరారు. అంటే ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉందన్న మాట! కాగా ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,793 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు ఆశించిన స్థాయిలో చొరవ తీసుకోలేదనేది స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా విద్యార్థుల చేరికలు కొనసాగుతున్నాయని, ఈ నెలాఖరు వరకు మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై నెల గడుస్తోంది. ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులు పుస్తకాలు, డ్రెస్సులు కొనుక్కోవడంతో పాటు కొందరు ఫస్ట్‌టెర్మ్ ఫీజు కూడా కట్టేసి ఉండడంతో ఇప్పుడు ప్రైవేటు నుంచి సర్కారు బడుల్లో చేరే విద్యార్థులు నామమాత్రంగానే ఉండనున్నారు.



తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ద్వారం వద్ద నిలిచిన మురుగు నీరు

▸ సీజనల్ వ్యాధులకిచ్చే పారాసిటమాల్ సిరప్, స్పోర్లక్ సిరప్‌ల స్టాక్ నిల్!
▸ మెడిసిన్ షార్టేజీపై పట్టించుకోని ఆస్పత్రి వైద్యాధికారులు
▸ హాస్పిటల్ ద్వారం వద్దే భారీగా మురుగు నీరు నిల్వ
▸ అపరిశుభ్రంగా దవాఖానా ప్రాంగణం
▸ తాండూరు మాతా శిశు ఆస్పత్రి దుస్థితి

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో.. మందుల కొరత!



మాతా శిశు కేంద్రంలో నామమాత్రంగా ఉన్న మందులు

తాండూరు, జూలై 11 : తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నెల రోజులుగా సీజనల్ వ్యాధులకు ఇచ్చే మందుల కొరత ఏర్పడింది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి పదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు తాండూరు-హైదరాబాద్ రోడ్డులో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా వైద్య సేవలందించేందుకు 150పడకల ఆస్పత్రిని నిర్మించారు. ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు, అలాగే అవసరమైన మందులు ఉచితంగా అందజేయాల్సి ఉంటుంది. వానకాలం కావడంతో చిన్నారులు వైరల్ ఫీవర్, జ్వరం, డయేరియా(వాంతులు, విరేచనాలు) వంటి వ్యాధులతో ఎక్కువగా ఆస్పత్రికి వస్తుంటారు. జ్వరం, వైరల్ ఫీవర్‌కు పారాసిటమల్ ట్యాబ్లెట్, పిల్లలకైతే సిరప్.. అలాగే వాంతులు, విరేచనాలకు స్పోర్లక్ మెట్రోజల్ సిరప్ ఇస్తారు. అయితే ఈ మందులు దవాఖానాకు సరఫరా కావడం లేదంటూ నెల రోజులుగా ఆస్పత్రి సిబ్బంది పిల్లలకు మందులు ఇవ్వడం లేదు. దీంతో రోగులు మెడికల్ షాపుల్లో కొనుక్కొంటున్నారు. డబ్బుల్లేని పేదలు మందులు కొనలేని పరిస్థితి ఉంది. వ్యాధి దానంతట అదే తగ్గే వరకు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆస్పత్రి అధికారులు అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టకే ఇక్కడ మెడిసిన్ కొరత ఏర్పడిందే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేదని, ముఖ్యంగా మాతా శిశురక్ష ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల మందులూ అందుబాటులోనే ఉంచుతున్నామని ఓ పక్క ప్రభుత్వం చెబుతోంటే తాండూరు ఆస్పత్రిలో మాత్రం మందుల కొరత తీవ్రంగా ఉంది. అత్యవసర మందులు ఒకవేళ ఆస్పత్రిలో లేకుంటే ఆస్పత్రి నిధులు వెచ్చించి బయట కొనుగోలు చేసి రోగులకు ఇవ్వాలి. కానీ అలాంటి సేవలేవీ ఇక్కడ లభించడం లేదు. ఇటీవల తాండూరు ఆస్పత్రిని కలెక్టర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేర్వేరుగా తనిఖీ చేసినా ఇక్కడి వైద్యాధికారులు మాత్రం మందుల కొరతపై వారి దృష్టికి తీసుకోకపోవడం శోచనీయం. ఆస్పత్రిలో అంతా సవ్యంగానే ఉందని, మందుల కొరత లేదని ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు వైద్యాధికారులు చెప్పడం విమర్శలకు తావిస్తోంది.

ఆస్పత్రి ఎదుటే పారుతున్న మురుగు నీరు

మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రధాన ద్వారం వద్ద మురుగు నీరు నిల్వ ఉంది. వర్షం పడినప్పుడల్లా నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటోంది. అక్కడ నిలిచిన నీటిని తొలగించకపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. రోగం నయం కోసం ఆస్పత్రికి వచ్చే వారికి కొత్త రోగాలొచ్చాలే పారిశుధ్య పరిస్థితి ఉంది. రోగుల వెంట వచ్చే సహాయకులకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రి నిర్వహణకు నిధులున్నా వాటిని వెచ్చించడం లేదు. కాయకల్ప అవార్డు కోసం ఆస్పత్రి లోపల సుందరంగా తీర్చిదిద్దడమే తప్ప ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.



బీఆర్‌ఎస్‌కు దెబ్బమీద దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌లోకి పలువురు జంప్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో నగర శివారుకు చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా గోడ దూకడానికి సిద్ధంగా ఉన్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. నగర శివారు ప్రాంతాల్లోనే బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయి. ఇప్పుడు వారంతా కాంగ్రెస్ వైపు చూస్తుండడం బీఆర్‌ఎస్‌కు పెద్ద దెబ్బే.

▸ దశల వారీగా చేరికలు
▸ నేడు హస్తం గూటికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బీఆర్‌ఎస్‌కు మరో దెబ్బ!

కాంగ్రెస్‌లోకి ఆరుగురు శివారు ఎమ్మెల్యేలు !

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చివరి అంకానికి చేరుకుంది. నగర శివార్లలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరినీ తమ గూటికి తెచ్చుకునేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు దాదాపు కొలిక్కి వచ్చాయి. నగర శివార్లలోని ఆరుగురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖరారైంది. అయితే దశల వారీగా ఈ చేరికలు జరగనున్నాయి. నేడు (శుక్రవారం) రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతో పాటు ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు, మరికొందరు అనుచరులు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. కొంత కాలం కిందట ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గంటసేపు మంతనాలు జరిపారు. ఈ విషయం తెలిసి బీఆర్‌ఎస్ నాయకత్వం అప్రమత్తమై ఆయన్ని బుజ్జగించింది. దీంతో ఆయన కొన్నాళ్లుగా స్తబ్ధతగా ఉన్నారు. అయితే స్థానిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆయన అధికార పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. అలాగే సోమవారం లేదా మంగళవారం మరో ఇద్దరు ఎమ్మెల్యేలు చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌ను వీడగా మిగతా వారు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. ఇటీవల చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. మిగతా వారు కూడా ఆయన బాటలోనే బీఆర్‌ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్ 10 అసెంబ్లీ సీట్లు కైవసం చేసుకోగా వీరిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొందరు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకేరోజు కాకుండా దశల వారీగా వీరి చేరికలు ఉండే విధంగా కాంగ్రెస్ ప్లాన్ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

రోడ్ల పనులు పూర్తి చేయండి

▸ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్
▸ తాండూరు, వికారాబాద్ ప్రాంత ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం


తాండూరు, జూలై 11: తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలోని పలు రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని అసెంబ్లీలో గల తన చాంబర్‌లో జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులపై ఆరా తీశారు. తాండూరు-వికారాబాద్ రోడ్డు పనుల ప్రక్రియను చేపట్టి వేగవతంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వరదలు వస్తే పనులు నిలిచిపోతాయని, అందుకే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తాండూరు-వికారాబాద్ ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

గ్రూప్-1 మెయిన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 11 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్ష అభ్యర్థులు శిక్షణ కోసం జూలై 19లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె.హన్మంతరావు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ వర్గాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కోసం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు జూలై 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ అప్లికేషన్లను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, థర్డ్ ఫ్లోర్, జామియా ఇసామియా కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్ అనే చిరునామాలో ఉన్న ఆఫీసులో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకొని ఎంపికైన వారికి జూలై 22 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 040-23236112 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని వెల్ఫేర్ అధికారి పేర్కొన్నారు.



కరుణించని వరుణుడు

- కార్తెల్లో చిరుజల్లులకే పరిమితం
- బోసిపోయిన చెరువులు, కుంటలు
- వర్షాల కోసం అన్నదాతల ఎదురు చూపు


అడుగంటిన కులకచర్ల మైలమ్మ చెరువు


ఇప్పయిపల్లిలో సాగుకు నోచుకోని భూములు

కులకచర్ల, జూలై 11: ఉమ్మడి కులకచర్ల మండలంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. వర్షం కురిస్తే దున్నకాలు చేపడదామని రైతులు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ముందు మురిపించిన వరుణుడు ప్రస్తుతం ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు వరినాట్లు ప్రారంభించలేదు. తూకం పోసేందుకు చినుకు కోసం ఆకాశం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి కులకచర్ల మండలంలో 34గ్రామాల్లో మొత్తం 10నోటిఫైడ్ చెరువులు, వందకుపైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. గతేడాది కూడా ఈ ప్రాంతంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. ఈసారి కూడా ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు కురవలేదు. మృగశిర, అరుద్ర కార్తెలో చిరుజల్లులు కురిశాయి. సాగుకు సిద్ధమవుతున్నా వర్షాలు కురువకపోవడంతో ఆయకట్టు రైతులు దుక్కి దున్నకుండా చినుకు కోసం ఎదురు చూస్తున్నారు. బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పూసల కార్తె ప్రారంభమైనా ఇప్పటికీ భారీవర్షం పడలేదు. దీంతో రైతులు ఈసారి కూడా వ్యవసాయం కష్టమే అంటూ ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే మండలంలోని 12వేల ఎకరాలకు పైగా వరిసాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని చెరువులు, కుంటలన్నీ వెలవెలబోతున్నాయి. నీరు లేక కులకచర్ల మైలమ్మ చెరువు, కామునిపల్లి చెరువు, అంతారం పాటిమీది చెరువు, ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువుతో పాటు ఆయా గ్రామాల్లో చెరువు కుంటలన్నీ బోసిపోతున్నాయి. ఆయాగ్రామాల ఆయకట్టు రైతులు చెరువు కుంటలు నిండితే వరిసాగు చేస్తారు. కానీ వర్షాలు లేక తూకాలు పోసి వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

వరి సాగు కష్టమే



వర్షాలు ఇలాగే ఉంటే ఈ సారి కూడా వరి సాగు కష్టమే. తిరుమలాపూర్ గ్రామ చెరువు ఆయకట్టు కింద రెండు ఎకరాల భూమి ఉంది. 20 రోజుల కిందటే తుకం కోసం భూమి చదును చేశాను. కానీ ఇప్పటి వరకు వర్షం కురవకపోవడంతో తుకం పోయలేదు. వానొస్తేనే దున్నడమవుతుంది. - రాములుగౌడ్, రైతు, తిరుమలాపూర్

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


కేజీబీవీ సందర్శనలో డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్

వికారాబాద్, జూలై 11: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ అన్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కేజీబీవీపీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. వంటశాల, నీటి సరఫరా పైపులైన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే నాన్ టీచింగ్ స్టాఫ్ ఫుడ్ హ్యాండ్లర్స్‌కు ఏవైనా అంటువ్యాధులు ఉన్నాయనేది గుర్తించడానికి హెల్త్ స్క్రీనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా సిబ్బందికి ఏమైనా వ్యాధులుంటే వారికి చికిత్స అందించి ప్రాథమిక దశలోనే వ్యాధిని నివారించడమే కాకుండా వీరి నుంచి విద్యార్థులకు సంక్రమించకుండా జాగ్రత్తపడుతున్నామన్నారు.











సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలి

» కలెక్టర్‌కు జిల్లా విద్యుత్ శాఖ అధికారుల వినతి

» మెరుగైన కరెంట్‌కు కొత్త సబ్‌స్టేషన్లు

రంగారెడ్డి అర్బన్, జూలై 11 : జిల్లా పరిధిలో 25 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్ శశాంకకు విద్యుత్‌శాఖ అధికారులు విన్నవించారు. జిల్లా పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తోంది. ప్రతీనెలా కొత్తగా వేల సంఖ్యలో వినియోగదారులు చేరుతోన్నారు. అలాగే దేశీయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు అంతరాయం లేని సరఫరాను అందించాలంటే.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఆ శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లాలో 400 కేవీ ఉపకేంద్రాలు 4, 220/132 కేవీ ఉపకేంద్రాలు 10, 132/33 కేవీ ఉపకేంద్రాలు 23, 33/11కేవీ ఉపకేంద్రాలు 241 ఉన్నాయి. వివిధ కేటగిరీల కింద మొత్తం 20,99,777 వినియోగదారులు ఉన్నారు. రోజువారీ సగటు విద్యుత్ వినియోగం 23.6 మి.యూ ఉండగా.. అత్యధిక విద్యుత్ డిమాండ్ 856.94 మెగావాట్లుగా ఉంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఫీడర్లపై లోడ్ ఎక్కువ కావడంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు జిల్లాలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 25 నిర్మించాలనుకుంది. ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్ శశాంకకు జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు అభ్యర్థించారు.

రంగారెడ్డి జిల్లాలో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ విద్యుత్ సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 25 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమి అవసరం కానుంది. స్థల సేకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సైబర్‌సిటీ విద్యుత్ సర్కిల్ పరిధిలో ఆరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. బొటానికల్ గార్డెన్, నెక్నమ్‌పూర్, నిలగడ్డ హుడా, హఫీస్‌పేట్, 8వ బెటాలియన్ పోలీస్ ప్రాంతంలో 2000 గజాలు, మంచిరేవులలో 24,200 గజాలు స్థలం ఇవ్వాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. అలాగే రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలో అత్యధికంగా ఎనిమిది 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి రాజేంద్రనగర్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో 1500 గజాలు, హిమాయత్‌నగర్ సర్వేనెంబర్ 62లో 1500 గజాలు, కిస్మత్‌పూర్‌లోని సర్వేనెంబర్ 161లో 1500 గజాలు, గగన్‌పహాడ్‌లోని సర్వేనెంబర్ 30లో 1500 గజాలు ఇవ్వాలని కోరారు. లక్ష్మిగూడ హౌజింగ్ బోర్డు కాలనీలో 2000 గజాలు, బండ్లగూడలోని సర్వేనెంబర్ 82లో 2000 గజాలు, అలీనగర్‌లోని రెగల్ కన్వెన్షన్ పరిధిలో 2000 గజాలు, శంషాబాద్‌లోని హుడా కాలనీలో 1500 గజాలు, అలాగే పద్మావతి కాలనీలో 1500 జగాలు ఇవ్వాలని కోరారు. రాజేంద్రనగర్ మీరాలం పార్కు సమీపంలో 1500 గజాలు, కింగ్ కాలనీ-కాటేదాన్‌లో 1500 గజాలు, జల్‌పల్లిలో 1500 గజాలు, బండ్లగూడలోని డబుల్‌బెడ్‌రూం పరిధిలో 1500 జగాలు ఇవ్వాలని కోరారు. సరూర్‌నగర్ పరిధిలో ఐదు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించాలని నిర్ణయించారు. సరూర్‌నగర్ పరిధిలోని ఫతుల్లాగూడలో 2000 గజాలు, రెడ్డికాలనీలో 2000 గజాలు, చైతన్యనగర్‌లో 2000 గజాలు, బడంగపేట్ డంపింగ్ యాదవ్ సమీపంలో 2000 గజాలు, మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద 2000 గజాలు ఇవ్వాలని విద్యుత్‌శాఖ కోరింది. అందుకు జిల్లా కలెక్టర్ శశాంక సానుకూలంగా స్పందించారు. సంబంధిత తహసీల్దార్లను భూమి ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

జనాభా నియంత్రణకు ట్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు

» జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

రంగారెడ్డి అర్బన్, జూలై 11 : జనాభా నియంత్రణకు ట్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో జిల్లాలో 6,753 కుటుంబ నియంత్రణ చికిత్సలు, 21 ఎన్ఎస్‌వీ (కుట్టులేని శస్త్రచికిత్సలు), తాత్కాలిక పద్ధతుల్లో 11,600 మందికి ఐయూసీడీ, 12,963మందికి నిరోధ్(కండోమ్‌లు) పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఎంవో శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వికారాబాద్, జూలై 11: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి కోరారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఆర్‌సీ 2023 అమలు చేయాలని, నాలుగు డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ హెచ్ఎస్ వైద్య చికిత్సలకు నగదు రహిత వైద్యం అందించాలన్నారు. జిల్లా స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.4వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన వస్తువులను అమ్మితే కేసులు


తనిఖీచేస్తున్న తూనికలు, కొలతల జిల్లా అధికారి రియాజ్ అలీఖాన్

మోమిన్‌పేట్, జూలై 11: నాణ్యత లేని, కాలం చెల్లిన వస్తువులను అమ్మితే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల వికారాబాద్ జిల్లా అధికారి రియాజ్ అలీఖాన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలు, హార్డ్‌వేర్ దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. నాలుగు కిరాణా దుకాణాల్లో కాలం చెల్లిన మిక్చర్ ప్యాకెట్లు ఉండగా కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. అదేవిధంగా హార్డ్‌వేర్ దుకాణంలో నకిలీ వస్తువులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. తూనికలు, కొలతల్లో తేడా ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వహీద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వేధిస్తున్నాడని ఫిర్యాదు


ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేందర్

శంషాబాద్, జూలై 11 : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తనను వేధిస్తున్నాడని ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు ఫిర్యాదు చేసినట్లు పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన సాతంరాయిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని సాతంరాయి గ్రామంలో సర్వేనెంబర్ 17లో తన తండ్రి, దివంగత జంగయ్యకు 12 ఎకరాల భూమి ఉందని, ఇటీవల తన తండ్రి మృతిచెందే వరకూ సాగుచేశాడని పేర్కొన్నారు. ఈభూమిపై చట్టబద్ధమైన ఆధారాలు ఉన్నాయని, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన హోదాతో అక్రమంగా ప్రవేశించేందుకు ఓ కాంట్రాక్టర్ ద్వారా ఆ భూమిలో నిర్మాణం చేయించే ప్రయత్నం చేశారని తెలిపారు. తన తాను, కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యామని, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.


ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

'డెన్స్ ప్లాంటేషన్'తో అభివృద్ధి

కేశంపేట, జూలై 11: డెన్స్ ప్లాంటేషన్‌తో ఫారెస్ట్‌లు అభివృద్ధి చెందుతాయని ఫారెస్ట్ రేంజర్ వెంకటయ్య తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట అటవీ ప్రాంతంలో గురువారం తలకొండపల్లి, కేశంపేట మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ప్లాంటేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు ఏ విధంగా నాటుకోవాలో ఆయన వివరించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్, డెన్స్ ప్లాంటేషన్ ఎలా ఏర్పాటు చేయాలో వివరించారు. అనంతరం అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేశంపేట, తలకొండపల్లి ఎంపీడీవోలు రవిచంద్రకుమార్‌రెడ్డి, శ్రీకాంత్, బీట్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్, ఏపీవో అజీజ్ పాల్గొన్నారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు


నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురువారం బాధ్యతలను స్వీకరించిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవనంలో నిర్వహించిన పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, ఎన్. చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డిలు వెళ్లి శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించి, అభినందనలు తెలిపారు.

రూ.2వేల కోట్లతో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వందల కోట్లతో పనులు

» మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ » మేడ్చల్ ప్రాంతంలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనుల పరిశీలన

మేడ్చల్ టౌన్, జూలై 11: సికింద్రాబాద్, కాచిగూడ, అలాగే జంట నగరాల పరిధిలోని పలు రైల్వే స్టేషన్లను, అలాగే మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని స్టేషన్లనూ రెండువేల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నట్టు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి పరిధుల్లో రైల్వే శాఖ చేపడుతున్న రైల్వే అండర్‌పాస్ వంతెనలను ఆయన రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. రైల్లే స్టేషన్ల అభివృద్ధి, ట్రాక్ పనులు, అండర్‌పాస్‌లు, రైల్వే బ్రిడ్జిల కోసం రైల్వేశాఖ వందల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించటంతో పాటు మారుమూల ప్రాంతాలకు రైల్వే సేవలు విస్తరించేందుకు కేంద్రం ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మల్కాజ్‌గిరి ప్రాంతంలోని అన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ప్రతిపాదన పంపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు రూ.32కోట్లు మంజూరు కాగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి సమీప ప్రాంతాలకు నడుస్తున్న లోకల్, ఎంఎంటీఎస్ సేవలను మరింత విస్తరించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైల్వే స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా రైల్వే స్టేషన్లు బ్రిటీషు కాలం నాటివి కావటంతో వాటిని ఆధునికీకరించేందుకు లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామన్నారు. ప్రజలకు మరింత మెరుగ్గా రైల్వే సేవలను అందించేలా రైల్వే శాఖ అధికారులతో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపుతున్నామని తెలిపారు.


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

తన లోక్‌సభ స్థానం పరిధిలో రైల్వే శాఖకు భారీగా ఆస్తులు, కార్యాలయాలున్నాయని.. వాటిని అభివృద్ధి చేసేలా కృషిచేస్తున్నామన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అండర్‌పాస్ బ్రిడ్జిల పనులను త్వరగా పూర్తిచేసేలా ఆదేశించినట్ట తెలిపారు. ఇటీవల ప్రారంభమైన గౌడవెల్లి అండర్ పాస్ పనులు కూడా త్వరలోనే పూర్తయ్యేలా చూస్తామన్నారు. అలాగే బొల్లారం రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి పనులను త్వరలోనూ ప్రారంభిస్తామన్నారు. ఎంపీ వెంట బీజేపీ మేడ్చల్-మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, పార్టీ మేడ్చల్ పట్టణాధ్యక్షుడు కొండం ఆంజనేయులు, నాయకులు రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిధులు

» ఎమ్మెల్యే చొరవతో కందనెల్లి, చంద్రవంచ, జుంటుపల్లికి విద్యుత్ సబ్‌స్టేషన్లు

» జిన్‌గుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి


జిన్‌గుర్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్

తాండూరు, జూలై 11: తాండూరు నియోజకవర్గంలో ఐదేళ్ల కిందట మంజూరైన కందనెల్లి, చంద్రవంచ, జుంటుపల్లి, జిన్‌గుర్తి గ్రామాలకు 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరైన విషయం తెలిసిందే. వాటిలో తాండూరు మండల జిన్‌గుర్తిలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. అయితే, పెద్దేముల్ మండలం కందనెల్లి, యాలాల మండలం జుంటుపల్లి, తాండూరు మండలం చంద్రవంచ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పనులు ముందుకు సాగడంలేదు. స్థలసమస్యలు, ఇతర కారణాల వల్ల పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. నిధులలేమితో వాటిని రద్దుచేసినట్లు సమాచారం. తిరిగి స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా రద్దయిన సబ్‌స్టేషన్‌లను తిరిగి మంజూరు చేయించేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ద్వారా మళ్లీ ప్రయత్నాలు చేసి వాటిని సాధించుకున్నారు. సంబంధిత సబ్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తిరిగి అంచనాలు తయారు చేసి పంపించాలని విద్యుత్ శాఖకు స్థలాలను వెంటనే గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు అప్పగించాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే తాండూరు మండలం జిన్‌గుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.3కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు వేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఐదేళ్ల కిందట అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికైన పైలట్ రోహిత్‌రెడ్డి మరోసారి ఈ సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు శంకుస్థాపనలు చేశారు. రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం టెండర్ల ప్రక్రియ వరకు వెళ్లి ఆగిపోవడంతో కొంత సబ్‌స్టేషన్ నిర్మాణం జరగలేదు. గతంలో తాండూరు మండలం చంద్రవంచలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రకృతివనం స్థలాన్ని పరిశీలించారు. పెద్దేముల్ మండలం కందనెల్లిలో ప్రభుత్వ భూమిని గుర్తించినప్పటికీ అట్టి భూమి ఎత్తుగా ఉండటంతో లెవలింగ్ చేయాల్సి ఉంది. యాలాల మండలం జుంటుపల్లి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎండోమెంట్ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో నిర్మాణానికి ఎండోమెంట్ క్లియరెన్స్ రావాల్సి ఉంది.


సాయితేజ


అకాష్

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి..

చైన్ స్నాచర్లుగా మారిన బీటెక్ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 11: ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, కొండాపూర్‌లో గల దారబోయిన రేణుక టీస్టాల్ నడుపుతుంది. గతనెల 17న ఇద్దరు దుండగులు స్కూటీపై వచ్చి సిగరెట్లు కావాలని రేణుకను అడిగారు. సిగరెట్లు ఇస్తుండగా పుస్తెలతాడు లాక్కొని స్కూటీపై పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా స్కూటీపై వస్తున్న ఇద్దరిని ఆపి సోదాచేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన దేవరకొండ సాయితేజ(20), మియాపూర్‌కు చెందిన ఉజ్జని ఆకాష్(20)లు మండలంలోని ఓ ఇంజనీరింగు కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు గత నెల 17న కొండాపూర్‌లో దారబోయిన రేణుక మెడలో నుంచి రోల్డ్‌గోల్డ్ పుస్తెలతాడు అపహరించుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. తర్వాత యాదాద్రి-భువనగిరి జిల్లా, బొమ్మలరామారంలో ఓమహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరించే ప్రయత్నం చేయగా చేతికి అందకపోవడంతో అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. వీరి వద్దనుంచి రోల్డ్‌గోల్డ్ పుస్తెలతాడు, స్కూటీని స్వాధీనం చేసుకొని, ఇద్దరిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూములు కోల్పోయాం.. ఇంటి స్థలాలైనా కేటాయించండి

» పరిహార కుంభకోణంపై విచారణ చేపట్టాలి

» సిద్దాపూర్‌లో అసైన్డ్ రైతులు ఆందోళన

కొత్తూర్, జూలై 11: జీవనాధారమైన భూములు కోల్పోయాం.. అరకొర పరిహారం ఇచ్చారు.. భూములు కోల్పోయిన తమకు కనీసం ఇంటి స్థలాలు, సామాజిక అవసరాలకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ గ్రామ అసైన్డ్ రైతులు గురువారం పారిశ్రామిక వాడకు కేటాయించిన భూముల్లో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో 278, 252, 361 సర్వే నెంబర్లలో దాదాపు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో వందలాది మంది రైతులకు అసైన్డ్ చేశారు. ఆ భూమిని కొందరు రైతులు సాగుచేస్తుండగా, మరికొందరు సాగు చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో రైతులకు అసైన్డ్ చేసిన భూమిని నామమాత్ర పరిహారాలు చెల్లించి తిరిగి స్వాధీనం చేసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం టీఎస్ఐఐసీకి అప్పగించిందని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదిలా ఉంటే, అసైన్డ్ రైతులకు రావాల్సిన పరిహారాన్ని గ్రామానికి చెందిన అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మధ్యవర్తిత్వం వహించి కొంత సొమ్మును దండుకున్నారని గతంలో రైతులు ఆందోళనలు కూడా చేపట్టారు. సదరు నాయకులు రికార్డులను సైతం తారుమారు చేసి పరిహారాన్ని సొమ్ము చేసుకున్నారని, ఇందుకు సంబంధిత శాఖ అధికారులు వత్తాసు పలికారని రైతులు ఆరోపించారు. పరిహారం విషయంలో కోట్లాది రుపాయలు పక్కదారి పట్టాయని, తమకు న్యాయం చేయాలని గతంలో ఆందోళనలు కూడా చేపట్టారు. కానీ, అసైన్డ్ రైతులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపానా పోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి విషయాన్ని తీసుకపోగా, ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సిద్దాపూర్ భూముల విషయమై విచారణ చేపట్టాలని మంత్రి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. అసైన్డ్ రైతులు పారిశ్రామిక పార్కు కోసం కేటాయించిన భూముల వద్ద తిరిగి గురువారం ఆందోళనకు దిగారు. పరిహారం విషయంలో భారీ కుంభకోణం జరిగిందని, తమకు నామమాత్రపు పరిహారం చెల్లించారని అవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల భూమిని కోల్పోయామని, కనీసం తాము ఇళ్లు కట్టుకోవడానికి, సామాజిక అవసరాల కోసం 25 ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరుగకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


సిద్దాపూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు


వెలిజర్లలో ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రైతులు మార్కెటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

» జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: రైతులు మార్కెంటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని, డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేసి అధిక దిగుబలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, కొండన్నగూడ గ్రామాల్లో గురువారం సాయంత్రం పంట పొలాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ మొక్కలను, కూరగాయల తోటలను పరిశీలించారు. అనంతరం కొండన్నగూడలో ఏర్పాటుచేసిన పట్టు రీరోలింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు, మార్కెట్ అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు తమకు కొత్తేనని, కూరగాయ పంటలతో మంచి ఆదాయం వస్తున్నదని రైతులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖల అధికారి నీరజా గాంధీ, ఏడీఏ ముత్యాలు, షాద్‌నగర్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

వికారాబాద్, జూలై 11: దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వికారాబాద్ డీఆర్డీవో పీడీ ఏ.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాపారంలో రాణించేందుకు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలోని చిన్న, చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న దివ్యాంగులను గుర్తించి, వారికి వారి ప్రతిభకు తగ్గట్లు వారు చేస్తున్న వ్యాపారాలను బలోపేతం చేస్తూ మెరుగైన జీవనోపాధిని పొందడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం గ్రూపులుగా ఏర్పాటు చేసి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దివ్యాంగుల పింఛన్ పొందాలంటే సదరం సర్టిఫికెట్ తప్పకుండా అవసరమని అన్నారు. నిరంతరం సదరం సర్టిఫికెట్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అర్హులైన దివ్యాంగులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని వస్తు రూపేన అందించడానికి 35 మందికి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పీఎస్ శ్రీనివాస్, క్లస్టర్ మేనేజర్ అరుణ్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ రామేశ్వర్, మెప్మా పీడీ రవికుమార్, జీఎం ఇండస్ట్రియల్ వినయ్‌కుమార్, ఐకేపీ డీపీఎం నర్సింహులు, ఐసీడీఎస్, లబ్ధిదారులు అలవేలు, మాధవి, సునీత, రవీందర్, మల్లేశం, భరత్ పాల్గొన్నారు.

నేడు కందుకూరుకు ఎమ్మెల్యే సబిత రాక

కందుకూరు, జూలై 11: అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి నేడు(శుక్రవారం) మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కందుకూరు మండలానికి రానున్నట్లు ఎంపీడీవో సరిత తెలిపారు. మండలంలోని నేదునూరులో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. 12 గంటలకు కొత్తూరులో అమెజాన్ కంపెనీ సహకారంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అన్నదాతలకు అండగా ఉండాలి

» సహకార బ్యాంకు ఉద్యోగులతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకు అండగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకార బ్యాంకు ఉద్యోగులను ఆదేశించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం డీసీసీబీ, ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఆరు ప్రాథమిక సహకార సంఘాలలో 22,694 మంది సభ్యులు ఉన్నారని, వారికి రూ.60కోట్ల 58లక్షల రుణాలను ఇచ్చామని డీసీసీబీ మేనేజర్ రవికుమార్ వివరించారు. 3,138 మంది రైతులు రూ.19కోట్ల 77లక్షల రుణమాఫీకి అర్హులని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని ప్రాథమిక సహకార సంఘాలలో రైతులు చెల్లిస్తున్న రుణాలకు రసీదులు ఇవ్వడం లేదని, వారి ఆస్తుల మార్టిగేజ్‌లను రిలీజ్ చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. తప్పు చేస్తున్న సీఈవోలు వెంటనే సరిచేసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే చట్ట ప్రకారం రైతుల నుంచి సభ్యత్వానికి రూ.330 మాత్రమే తీసుకోవాలని, ఎక్కువ తీసుకోవద్దని సూచించారు. రైతులను మోసగించే వారిని ప్రభుత్వం సహించదని, అన్నదాతకు అండగా ఉండేవారే బ్యాంకుల్లో పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. సమీక్షలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు ఎం.వెంకటయ్య, నర్సింహ, వినయ్‌కుమార్, అనిత్‌కుమార్, మహమూద్ షరీఫ్, కె.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఘట్‌కేసర్: అన్నోజిగూడ జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూలై 11: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ జడ్పీ హైస్కూల్‌లో, మున్సిపల్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈగలు, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు రతన్‌లాల్ అన్నారు. బాలంపేట, దౌల్తాబాద్ బీసీ వసతి గృహాల సిబ్బందికి గురువారం వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, తుల్జారాం, సిబ్బంది రఫీ, శ్రీధర్, ఏఎన్ఎంలు అనురాధ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోమిన్‌పేట్ వైద్యాధికారిణి సుజన జయ్ అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో గురువారం విద్యార్థినులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: హాస్టల్ విద్యార్థులు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జినుగుర్తి పీహెచ్‌సీ డాక్టర్ రశీద్ అన్నారు. మండలంలోని జినుగుర్తి సమీపంలో ఉన్న కేజీబీవీ, గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహం, మైనార్టీ బాలుర వసతి గృహంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు హాస్టల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, బీసీ బాలుర వసతి గృహంలో గురువారం బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కాలంలో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువు వాపు, కళ్ల పచకలు(జాండిస్) వంటి వ్యాధులు వ్యాపిస్తాయని ఆమె చెప్పారు. ఇలాంటి వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా బోధనేతర సిబ్బంది రక్తనమూనాలు తీసుకుని అన్నిరకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, అజ్మత్ ఫాతిమా, సురేందర్, అజ్రాతాజ్‌అలీ, ఇజాహార్ సిద్దిఖీ, స్వాతి పాల్గొన్నారు.



పరిగి: నస్కల్‌లోని కేజీబీవీలో వైద్యపరీక్షలు చేయిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్

పరిగి: మునిసిపల్ పరిధిలోని హాస్టళ్లలో, నస్కల్‌లోని కేజీబీవీ పాఠశాలల్లో పనిచేసే సిబ్బందికి మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ గురువారం వైద్యపరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామందర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కల్లు దుకాణం వద్ద గోడను పరిశీలిస్తున్న తహసీల్దార్ కమిషనర్

పరిగి, జూలై 11: 'మందుబాబుల అడ్డాగా... మార్కెట్ గోదాం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పరిగి తహసీల్దార్ ఆనంద్ రావు, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యల బృందం గురువారం పరిగిలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న కల్లు దుకాణాలను సందర్శించారు. మార్కెట్ యార్డు గోడను కూల్చివేయడాన్ని పరిశీలించారు. అనంతరం వాటిని తిరిగి కూలగొట్టిన గోడను నిర్మింపజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ సత్యకుమార్, మునిసిపల్ సూపర్‌వైజర్ దశరథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాండూరుకు మాజీ ఎమ్మెల్యే పైలట్

తాండూరు, జూలై 11: పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత మొట్టమొదటి సారి తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి తాండూరుకు విచ్చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ప్రోగ్రాం ఖరారైయింది. ఈనెల 10న 'ఆంధ్రజ్యోతి'లో 'నడిపించే నాయకుడెవరు.?' అనే శీర్షికన బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి, పైలట్ రోహిత్‌రెడ్డి రావడం లేదన్న కథనాన్ని ప్రచురించిన విషయం విధితమే. దీంతో మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోహిత్‌రెడ్డి కథనానికి స్పందించారు. శుక్రవారం తాండూరుకు వస్తున్నానని పార్టీలకతీతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్‌ఎంపీపీలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాఘవేంద్ర కాలనీలో గల మాజీ ఎమ్మెల్యే నివాసంలో నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, మండలాల, గ్రామీణ కమిటీల అధ్యక్షులతో సమావేశమై పార్టీ పటిష్టతపై రోహిత్‌రెడ్డి చర్చించనున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలలో నెలకొన్న అనిశ్చితిని తొలగిస్తారని వెల్లడించారు.

వైభవంగా ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

బొంరాస్‌పేట్, జూలై 11: మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గురువారం ఊరడమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు నారాయణమ్మ, అంజిల్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సత్యనారాయణ, రాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట్, జూలై 11: దుద్యాల మండల కేంద్రంలో గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. గురువారం తహసీల్దార్ దానయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవి, మాజీ సర్పంచ్ ఖాజామీయ, కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య, శ్రీశైలం గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

మెడికల్, పశువైద్య కళాశాలలకు భూమి కేటాయింపు

కొడంగల్, జూలై 11: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుకు భూసేకరణ పూర్తయింది. మండలంలోని అప్పాయిపల్లి శివారులో సర్వే నెం.19 లో 60 ఎకరాల భూమిని గురువారం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. కొంత కాలంగా భూసేకరణలో ఆటంకం కలిగినా చివరికి మార్గం సుగమమైంది. గతంలో అసైన్డ్ కింద పలువురు రైతులకు భూమిని కేటాయించారు. అందులో 43 మంది రైతుల నుంచి 60 ఎకరాల భూమిని రైతుల ఒప్పందం మేరకు మెడికల్, పశువైద్య కళాశాలలకు కేటాయించారు. 20 ఎకరాల భూమిని మెడికల్ కళాశాల, 40 ఎకరాలు పశువైద్య కళాశాలకు కేటాయిస్తూ హద్దులు ఏర్పాటు చేశారు. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.10 లక్షలు, ఇంటికో ఉద్యోగం, వంద గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు రైతులతో ఒప్పించారు. 43 మంది రైతులు అంగీకారం తెలపడంతో సంబంధిత భూమిని సర్వే చేయించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బొంరాస్‌పేట్, జూలై 11: హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కొడంగల్, బొంరాస్‌పేట్ నాయకులు గురువారం కేటీఆర్‌ను కలిశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయిన బొంరాస్‌పేట్ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ నెహ్రూనాయక్‌తో మాట్లాడుతూ పార్టీ పరంగా కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్ఎస్ దుద్యాల మండల అధ్యక్షుడు చాంద్ పాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కులకచర్ల, జూలై 11: మండలంలోని ఇప్పాయిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అధిక జనాభా వలన కలిగే నష్టాలు, ప్రస్తుత జనాభా నుంచి మనం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాండురంగయ్య, కిరణ్‌కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యామ్‌సుందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



తాండూరు రూరల్: హెచ్‌ఎం నాగప్పను సన్మానిస్తున్న గ్రామస్థులు

పరిగి, జూలై 11: ఉద్యోగులకు బదిలీలు సహజమని పరిగి ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. మండలంలోని రుకుంపల్లి పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన వెంకట్‌రెడ్డి, రఘువీర్‌లను గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలయ్య, కార్యదర్శి రామాంజనేయులు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ అనిత, సీఆర్‌పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, మోహన్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలకు హెచ్‌ఎం నాగప్ప చేసిన సేవలు మరువలేనివని ఎంఈవో వెంకటయ్య అన్నారు. మల్కాపూర్ హెచ్‌ఎం నాగప్పతోపాటు మరో నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం ప్రస్తుత హెచ్‌ఎం బాబ్బునాయక్, గ్రామస్థుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దులో వెనుకబడిన మల్కాపూర్ గ్రామంలో 9ఏళ్లపాటు హెచ్‌ఎంగా నాగప్ప పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని హెచ్‌ఎం నాగప్పతోపాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీలు రవి సింధే, రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు మజీద్, కాశీనాథ్, హసన్, హైస్కూల్ హెచ్‌ఎంలు వైద్యనాథ్, మృత్యుంజయస్వామి, పీఆర్టీయూ నాయకులు పురుషోత్తంరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాగప్ప, శశిధర్, శ్రీనివాస్, మనోహర్, పండరి, సభ్యులు శంషోద్దీన్, అల్లావుద్దీన్, బోయిని నర్సింహులు, మహేందర్, శ్రీశైలం, పండరిచారిలు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని రెడ్డిఘణాపూర్ ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సుదీర్ఘ కాలం పనిచేసి బదిలీపై వేర్వేరు పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులకు గురువారం వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత, అనసూయ, బాలమణి, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వర్, యశోధభాయ్‌లకు శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిరీష, రామకృష్ణ గౌడ్, మండల బీసీ సంఘం నాయకులు నరేందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు రవికాంత్, జగదీశ్వర్, హన్మంతు నాయక్, బాలమణి, పరశురాములు, ఎల్లప్ప, వరణు పాల్గొన్నారు.

దోమ: బుద్లాపూర్ పాఠశాలలో గురువారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విధులు నిర్వహించిన హెచ్‌ఎం బద్రినాయక్, వాణి, సంగీత బదిలీ కావడంతో గ్రామస్థులు వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లాల్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బషీరాబాద్: మంతట్టి పాఠశాలలో ఉపాధ్యాయులకు సత్కారం

న్యాయవాదుల నిరసన



పరిగి కోర్టు ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

పరిగి, జూలై 11: సిద్దిపేటలో న్యాయవాదుల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ గురువారం పరిగి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్ పోలీస్‌స్టేషన్‌లో షూరిటీలు ఇచ్చేందుకు వెళ్తే అక్కడి పోలీసులు ఐదు గంటలపాటు కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నట్లు తెలిపారు. అంతసేపు ఎందుకు కూర్చోబెట్టారని ప్రశ్నిస్తే న్యాయవాదిపై చేయిచేసుకోవడంతోపాటు, మొబైల్‌ను పగులగొట్టడమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

గురునాథ్‌రెడ్డికి సత్కారం



కొడంగల్, జూలై 11: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డికి ప్రభుత్వం పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ప్రజాప్రతినిధులు, కొడంగల్ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో గురునాథ్‌రెడ్డిని మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, చిన్న, టి.సాయిలు, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, డైరెక్టర్ వినోద్‌కుమార్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాములగుట్ట ఆలయ అభివృద్ధికి సహకరించాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మధుకృష్ణ

మూడుచింతలపల్లి, జూలై 11: లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని రాములగుట్ట ఆలయ అభివృద్ధికి సహకరించాలని లక్ష్మాపూర్ గ్రామ యువనాయకుడు క్యాతం మధుకృష్ణ కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాములగుట్ట ఆలయ స్థలం అటవీశాఖ ఆధీనంలో ఉన్నందున సంబంధిత అటవీ భూమిని గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమికి బదలాయించి దేవస్థానానికి భూమి అప్పగించాలన్నారు. ల్యాండ్ డైవర్షన్‌కు సంబంధించి ఎన్‌వోసీని త్వరగా ఇచ్చేటట్లుగా కమిటీ చైర్మన్ (కలెక్టర్) కు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం



కొడంగల్, జూలై 11: కొడంగల్ పట్టణానికి చెందిన మొహ్మద్ అబ్దుల్ కబీర్ ఉమ్రాకు గురువారం బయల్దేరాడు. ఈ సందర్భంగా ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే.గుల్షన్, మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఐఎం పార్టీ కార్యాలయంలో, మక్కా మస్జీద్‌లో ఆయనకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** తాండూరు మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్లు గురువారం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

● **మర్పల్లి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ మల్లేశ్‌యాదవ్ మర్పల్లి తహసీల్దార్ గణేశ్‌కు వినతి పత్రం అందజేశారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వారు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖతో గురువారం సైబర్ నేరాలపై గ్రామీణ విద్యార్థులకు అవగాహన కల్పించటానికి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వారు కళాశాలకు రూ.17,83,500 మంజూరు చేసిన పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● **పరిగి:** న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పరిగికి చెందిన గంగారం కృష్ణారెడ్డిని గురువారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. పరిగిలో పనిచేస్తున్న కృష్ణారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

● **పరిగి:** భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

● **బషీరాబాద్:** జీవన్గి బర్కాలలో నీటి సమస్యకు గురువారం చెక్ పెట్టారు. డైరెక్టు పంపింగ్ సిస్టం బోరు మరమ్మతుకు గురవడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి బోరును మరమ్మతు చేయించారు. ఇక నీటి కొరత ఉండదని గ్రామ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు.

● **ధారూరు:** బ్లాకులో సినిమా టికెట్లు అమ్ముకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాధారి కిషోర్ సీఎం రేవంత్‌రెడ్డిని దూషించడాన్ని ఖండిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయన కిషోర్‌ను హెచ్చరించారు.

● **శామీర్‌పేట:** సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను గురువారం తూంకుంట మున్సిపల్‌కు చెందిన కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రాంచందర్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

● **యాలాల/తాండూరు రూరల్:** ఎన్కేపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు కిష్టప్ప, లక్ష్మప్ప ద్వారా తెలుసుకున్న బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంపత్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. జినుగుర్తిలో అనారోగ్యంతో భాగిషేరి వీరప్ప మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు అజ్మత్‌అలీ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

● **ధారూరు:** ఆది జాంబవ మహారాజ్ జయంతిని ధారూరులో మాదిగ జాగృతి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఆది జాంబవ మహారాజ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **మేడ్చల్ టౌన్:** కిష్టాపూర్ ఎంఆర్ఈఎం కాళాశాలకు ఆటానమస్ గుర్తింపు లభించిన సందర్భంగా గురువారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో ఎంఆర్ఈఎం విద్యాసంస్థల చైర్మన్ వేముల మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ సుబ్బరత్నం, కార్యదర్శి కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ధారూరు:** మండలంలో నేడు (శుక్రవారం) శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కె.విజయబాస్కర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● **కులకచర్ల:** కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. కులకచర్ల రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టనున్నట్లు కాంగ్రెస్ నాయకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **మర్పల్లి:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, ఎర్రోళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

● **దోమ:** బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో శ్రీదత్త సాయి హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు.

● **కులకచర్ల:** తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్, స్థానికులు ఉమాశంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పొలంలో విద్యుత్ కంచెకు తగిలి యువకుడు మృతి

బషీరాబాద్, జూలై 11: వ్యవసాయ పొలంలో అడవి పందుల రక్షణకు వేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగిలిన ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నంద్యానాయక్‌తండా శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన శంకర్ రాథోడ్ కుమారుడు అవినాష్(19) పదోతరగతి వరకు చదువుతున్నాడు. బుధవారం రాత్రి తండాకు చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి రాత్రి 10గంటల సమయంలో కుందేళ్లవేటకు వెళ్లారు. ఈక్రమంలో దామర్‌చెడ్ గ్రామానికి చెందిన బలరాం తన పొలానికి అడవి పందుల రక్షణ కోసం వేసిన కంచెకు ప్రమాదవశాత్తు తగిలాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంట ఉన్న ఇద్దరు స్నేహితులు తండాకు హుటాహుటిన చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ సిబ్బందితో కలిసి రాత్రికిరాత్రి ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తాండూరు రూరల్ సీఐ అశోక్‌కుమార్ గురువారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి యువకుడి మృతికి గల కారణాలపై బాధిత కుటుంబసభ్యులను ఆరాతీశారు. ఇదిలా ఉండగా తండాపెద్దలు కొందరు పొలం యజమానితో పంచాయతీ పెట్టి మృతుడి కుటుంబానికి రూ.4.20 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆ డబ్బులు చెల్లించేందుకు సదరు యజమాని ఒప్పుకున్నట్లు సమాచారం. మృతుడి తల్లి శాంతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

జీవన్గి చెక్‌డ్యాంలో యువకుడు గల్లంతు

బషీరాబాద్, జూలై 11: స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు చెక్‌డ్యాం నీటిలో ప్రమావశాత్తు పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం జీవన్గి శివారు కాగ్నానది చెక్‌డ్యాంలో గురువారం చోటుచేసుకుంది. జీవన్గి బర్కాల గ్రామానికి చెందిన మస్తాన్‌సాబ్ కుమారుడు మహమ్మద్ అజీంపాషా(35) ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని కాగ్నానది చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఇద్దరు స్నేహితులు చేపల కోసం నీటిలో దిగగా, అక్కడే ఒడ్డున ఉన్న యువకుడు ఒంటిపై షార్టు, ప్యాంట్ విడిచిపెట్టి కనిపించకుండాపోయాడు. కొంత సేపటికి స్నేహితులు వచ్చి చూడగా యువకుడు అక్కడ లేకపోగా దుస్తులు ఒడ్డుపై కనిపించాయి. కంగారుపడ్డ ఇద్దరు యువకులు వెంటనే కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతై ఉండొచ్చనే అనుమానంతో గజఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. చీకటి పడటంతో చేసేదేమి లేక అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు.

రైల్వే మహిళా సిబ్బందిపై వీధికుక్కల దాడి

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఘట్‌కేసర్, జూలై 11: వీధికుక్కలు ఇద్దరు రైల్వే మహిళా సబ్బందిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన గురువారం ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తున్న అన్నపూర్ణ, లక్ష్మి గురువారం ఉదయం పనిముట్లు తీసుకొని రైల్వేక్వాటర్స్ వైపునకు వస్తుండగా వీధికుక్కలు ఇరువురిపై ఒక్కసారిగా దాడిచేశాయి. ఇందులో అన్నపూర్ణ అనే మహిళ కిందపడటంతో ముక్కు, మొహంపై కరిచి గాయపరిచాయి. లక్ష్మిఅనే మహిళపై సైతం కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. వారు అరుపులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరిమేశారు. అప్పటికే ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఘట్‌కేసర్‌లో వీధి కక్కల బెడద తీవ్రమైందని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన కనీసచర్యలు కరువయ్యాయని పలువురు వాపోతున్నారు. పెద్దవారు కావడంతో వారి అరుపులు విని స్థానికులు వెంటనే స్పందించారని, చిన్నపిల్లలు అయితే ఏం జరిగేదో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తేరుకొని కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుట్కా, రేషన్ బియ్యం స్వాధీనం

వికారాబాద్/తాండూరు/నవాబుపేట, జూలై 11: గుట్కా, రేషన్ బియ్యం నిల్వలపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కె.నారాయణ రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.7.5లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ రైస్‌ను తరలిస్తుండగా వ్యాపారులపైన అధికారులు దాడి చేసి 14.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. నల్గొండ జిల్లాకు చెందిన వ్యాపారస్తులు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేకాడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

తాండూరు రూరల్, జూలై 11: కోటబాస్పల్లిలో పేకాడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. గ్రామ శివారులో గురువారం పేకాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న గంగపల్లి అంబ్రేష్, వడ్డె ఎల్లప్ప, బోయిని సునిల్, ఈడ్గి శ్రీనివాస్, బోయిని రమేష్, మల్లేష్ యాదవ్, వెంకటేష్‌గౌడ్ వద్ద నుంచి రూ.3500ల నగదు, రెండుసెట్ల పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన మాజీ ఎమ్మెల్యే



జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు ఎస్పీ నారాయణరెడ్డిలను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. -వికారాబాద్

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం మర్యాద పూరకంగా కలిశారు. ఆయనతో పాటు మేడ్చల్ జిల్లా గంథాలయ మాజీ చైర్మన్, మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానందర్ యాదవ్ ఉన్నారు. - మేడ్చల్ టౌన్

ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మాజీ సర్పంచ్



ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను గురువారం ఘనాపూర్ మాజీసర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్ కలిసి శాలువాతో సత్కరించారు. ఎన్ఎస్‌యుఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి శివాజీనాయక్, నానావత్ భిక్షపతినాయక్‌లు బెల్లయ్యనాయక్‌ను కలిశారు. - ఘట్‌కేసర్ రూరల్

సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులివ్వండి



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

తాండూరు, జూలై 11: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గురువారం కలిశారు. త్వరలో ప్రకటించే బడ్జెట్‌లో తాండూరు ప్రాంతానికి చెందిన సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. తాండూరు నియోజకవర్గంలోని కోట్‌పల్లి, జుంటుపల్లి, అల్లాపూర్ ప్రాజెక్టు, నవాంద్గి ఎత్తిపోతల పథకం, చెరువుల ఆయకట్టు చేపట్టాలని పనుల వివరాలను మంత్రిని ఎమ్మెల్యే వివరించారు. మంత్రిని కలిసిన వారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.

పోచారం తైబజార్ వేలం

ఘట్‌కేసర్, జూలై 11: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో నిర్వహించే వారాంతపు సంతల నిర్వహణకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. తొమ్మిది నెలల కాలపరిమితికి రూ.5.67లక్షలకు కొక్కెర్ల శ్రీనివాస్ వేలం దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.